క్లుప్తంగా

శిల్పారామం సీఈఓగా స్వామి నాయుడు



భవానీపురం(విజయవాడపశ్చిమ):రాజమహేంద్రవరం టూరిజం హబ్ ప్రాంతీయ సంచాలకులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వి.స్వామి నాయుడు సోమవారం శిల్పారామం ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ లయోలా కళాశాల వద్దగల ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని శిల్పారామాల నిర్వహణ వ్యవస్థ పర్యవేక్షణ చేపడతామని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో మరిన్ని శిల్పారామం కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా సీఈఓ స్వామి నాయుడును కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు. స్వామి నాయుడు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు సంబంధించిన భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)కు ఇన్‌చార్జ్ సీఈఓగా నియమితులయ్యారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఎవరైనా రోడ్లు, ఫుట్‌పాత్‌లతో పాటు మున్సిపల్ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీసీపీ జి.రామకృష్ణ పేర్కొన్నారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణవీధి, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ పరిసరాల్లో రామకృష్ణ, కొత్తపేట సీఐ చిన్న కొండలరావు, పోలీసు సిబ్బంది స్ట్రీట్‌వాక్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి సూచనలు ఇచ్చారు. పాదచారులకు, వాహన చోదకులకు ఇబ్బంది కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని తెలిపారు. పోలీసు సూచనలు పట్టించుకోకుండా వ్యాపారాలు సాగిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయం



పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరించే దిశగా జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉండాలని వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఆయన నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 14 ఫిర్యాదులు అందుకున్నారు. అందులో పట్టణ ప్రణాళిక విభాగంపై-5, ప్రజారోగ్యంపై- 2, ఇంజినీరింగ్‌పై- 2, రెవెన్యూ విభాగం-3, ఎస్టేట్ విభాగంపై ఒకటి, వరదల సంబంధిత ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సుపరింటెండెంటింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి సత్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టీ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కండ్రికలో తాగునీటికి పరీక్షలు



పాయకాపురం(విజయవాడరూరల్):ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం కండ్రికలో తాగునీటి పరీక్షలను ఏఈ మాధవ్ నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు, కాశీమ్‌రోడ్డులో నీటి సరఫరా విధానం, తాగునీటికి సంబంధించి కార్పొరేటర్ కార్యాలయానికి ప్రజలు ఫిర్యాదు చేశారు. వెంటనే వీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అసిస్టెంటు ఇంజినీరు మాధవ్, స్థానికులతో కలిసి తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి వాటిని పరీక్ష చేశారు. ఎలాంటి తేడా లేదని చెప్పారు.



వన్‌టౌన్ పాత శివాలయం వద్ద శివయ్యను దర్శించుకునేందుకు క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

పరమ పవిత్రం కార్తిక దీపం

కార్తికమాసం తొలి సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే భక్తులు కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి పరమ పవిత్రంగా భావించే కార్తిక దీపాలు వెలిగించారు. ఆయా ప్రాంతాల్లోని శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. విజయవాడలోని అన్ని ప్రాంతాల్లో శైవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కృష్ణానదిలో తెల్లవారుజామునే పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



అరటి దొప్పల్లో దీపాలు వెలిగిస్తున్న యువతులు



పాత శివాలయం వద్ద శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



భవానీపురం పున్నమిఘాట్ వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

- కళకళలాడిన ఆలయాలు
- ముక్కంటికి విశేష అభిషేకాలు
- అమ్మవారికి కుంకుమార్చనలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పవిత్రమైన కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పరమశివుడిని తలచుకుంటూ భక్తులు చేసిన హర నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి శివాలయాలన్నింటిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా స్వామి వారికి మహాన్యస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగార్చన నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులు తీరి కనపించారు. ప్రధానంగా కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో భక్తులు భారీగా ఆయా శైవాలయాలకు తరలివచ్చారు.

వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తుల తెల్లవారుజాము మూడు గంటల నుంచి పోటెత్తారు. సాయంత్రం భక్తులు భారీగా ఆలయానికి తరలివచ్చారు. కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి షణ్ముగం పర్యవేక్షించారు. పాతబస్తీలోని అర్జునుడు ప్రతిష్ఠించిన విజయేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దశశాంతులు, సహస్రనామార్చన చేశారు. కొత్తపేటలోని గంగా పార్వతీ సమేత ధర్మేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీ ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా ఉపాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో కొలువై ఉన్న పరమశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్‌గోపాల్ సత్రం ప్రాంగణంలో కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పాతశివాలయంలో స్వామి వారికి పూజలు



పాతశివాలయంలో సహస్రలింగార్చన



అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న భ్రమరాంబ అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో పార్వతీ అమ్మవారు

మల్లేశ్వరుడికి బిల్వార్చన



సహస్ర లింగార్చన పూజలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామరావు



సహస్ర లింగార్చన అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ



సహస్ర దీపాలంకరణ సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై వేం చేసిన శ్రీమల్లేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు, బిల్వార్చన జరిగింది. సోమవారం తెల్లవారుజామున స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు, ఉభయదాతలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అభిషేకాలను జరిపించుకున్నారు. మధ్యాహ్నం స్వామి వారికి బిల్వార్చన నిర్వహించారు. బిల్వార్చనలో ఆలయ ఈవో కెఎస్.రామరావు పాల్గొనగా, ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో పూజలు జరిపించారు. సాయంత్రం మల్లేశ్వర స్వామి వారి ఆలయం, అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు నటరాజ స్వామి వారి ఆలయాల్లో ఆకాశ దీపాలను వెలిగించారు. మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో సహస్ర లింగార్చన నిర్వహించారు. సహస్ర లింగార్చనలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆలయ ఈవో రామరావు, డీఈవో రత్నరాజులు పూజలో పాల్గొన్నారు. లింగార్చన అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించగా, పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరలించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ జరిగగా, ఆలయ ఈవో , వైదిక కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు స్వామి వారి అన్న ప్రసాద వితరణ జరిగింది. మల్లేశ్వర స్వామి వారి ఆలయం, మహా మండపం రాజగోపురం ఎదుట సుమారు 2500 మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

బ్యాడ్మింటన్ టోర్నీ మెయిన్ డ్రాకు 46 మంది అర్హత



విజయవాడస్పోర్ట్స్:కాసా వడ్లమూడి మోహన్‌కృష్ణ మెమోరియల్ రాష్ట్ర స్థాయి అండర్-13 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో 46 మంది క్రీడాకారులు మెయిన్ డ్రా కు చేరారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. సింగిల్స్‌లో మూడు, డబుల్స్‌లో రెండు రౌండ్ల పాటు హోరాహోరీగా మ్యాచ్‌లు జరిగాయి. ఈ మ్యాచ్‌ల బాలికల సింగిల్స్‌లో 16, బాలుర సింగిల్స్‌లో 16, బాలుర డబుల్స్‌లో 8, బాలికల డబుల్స్‌లో 6 మంది నేటి నుంచి జరిగే మెయిన్ డ్రా మ్యాచ్‌లకు అర్హత సాధించారు. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మెయిన్ డ్రా మ్యాచ్‌లలో వీరంతా తలపడతారు. మంగళవారం ప్రారంభమయ్యే మెయిన్ డ్రా మ్యాచ్‌లను క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరి ప్రకటించారు.

అలరించిన కర్ణాటక సంగీతం



కళాకారులకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న డెప్యూటీ ఈవో రత్నరాజు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ముత్యాలంపాడుకు చెందిన శ్రీవీణాధరి సంగీత శిక్షణాలయానికి చెందిన కళాకారులు పలు కీర్తనలు ఆలపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై సుసర్ల నందిని శ్రీనివాస్ పర్యవేక్షణలో జి. రాజేశ్వరి పలు కీర్తనలు ఆలపించగా, ఎస్. తరుణి విశ్వనాథ సరవన్ మృదంగంపై చక్కటి సహకారం అందించారు. కళాకారులు ఆలపించిన భక్తిగీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకోగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు వారి ప్రతిభను మెచ్చి ప్రశంసా పత్రాన్ని అందించారు. సంగీత ప్రదర్శన అనంతరం ఆలయ డెప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేయగా, ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

శివాలయాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు



రామలింగేశ్వర స్వామికి విశేష అలంకారం, బిల్వార్చన



మల్లికార్జున స్వామి వారికి విశేష అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు శివాలయాల్లో స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భీమనవారి పేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి బిల్వార్చన నిర్వహించగా, పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతుల సేవ , ఆకాశదీపాన్ని వెలిగించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామి వారికి ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజలు చేశారు. పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో అభిషేకాలు జరిపించుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఈవో రావూరి వెంకటేశ్వరరావు, ఆలయ ఫౌండర్ చైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి విచ్చేసి ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలు నిర్వహించారు.

మహిళలంటే పవన్‌కల్యాణ్‌కు ఎప్పుడూ చిన్న చూపే

పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మొదటి నుంచి మహిళలపై చిన్న చూపు చూస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ విమర్శించారు. ఆయన సోమవారం ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ దళిత మహిళలంటే పవన్‌కల్యాణ్‌కు మరింత చిన్నచూపా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే పంతం నానాజీ ఒక దళిత ప్రొఫెసర్‌పై దాడి చేసిన ఘటనపై పవన్ ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. జానీ మాస్టర్, ఆదిమూలం, గుడ్లవల్లేరు ఘటనల లాంటి అనేక సంఘటనలపై పవన్ స్పందించి ఉంటే బాగుండేదన్నారు. అధికారంలోకి రాగానే మొదట సుగాలి ప్రీతి కేసును పరిష్కరిస్తామని పవన్ చెప్పారని, బహుశా మర్చిపోయి ఉంటారని ఎద్దేవా చేశారు. పవన్‌కల్యాణ్ అటవీశాఖ పర్యావరణం గురించి మాట్లాడారని, మరి కప్పట్రాళ్ల, కర్నూలులో ఆయన మంత్రిగా ఉన్న తర్వాత యురేనియం తవ్వకాల సంగతి ఏమిటని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ కొత్త రాజకీయ నాటకాలు, డ్రామాలు ఏంటో అర్థం కావటం లేదన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పెజ్జోనిపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షబ్బీర్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు సోమవారం పెజ్జోనిపేటలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు షబ్బీర్, రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌లు వాడే వారే ఎక్కువగా సైబర్ నేరాలకు గురవుతున్నారని వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు రకరకాల ప్రలోభాలకు గురిచేసి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ సైబర్ నేరాల పట్ల కొద్ది పాటి అవగాహన కలిగి ఉంటే వాటికి దూరంగా ఉండవచ్చని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తమ నివాసాల పరిసర ప్రాంతాలలో అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు.

మౌలిక వసతులపై దృష్టి పెట్టండి

ధర్నాలో సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు



సర్కిల్-1 కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):పన్నుల వసూళ్లపై నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది చూపించే శ్రద్ధ రోడ్ల నిర్మాణం, తాగునీటి కొరత వంటి మౌలిక వసతులపై పెట్టాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక టేనర్ పేట ప్రాంతంలో 46, 47 డివిజన్లను అనుసంధానం చేసే ప్రధాన రహదారి పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలని, తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేస్తూ చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని సర్కిల్-1 కార్యాలయం ముందు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు టేనర్‌పేట అడ్డ రోడ్డును తవ్వి వదిలేసిన మున్సిపల్ అధికారులు ఆ తరువాత పట్టించుకోలేదని గుర్తు చేశారు. దీంతో రెండు డివిజన్లను అనుసంధానం చేసే ఈ రహదారి అధ్వానంగా తయారవ్వటంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇటీవల సంభవించిన బుడమేరు వరద కారణంగా రహదారిపై మట్టి కొట్టుకుపోయి గుంతలు పడి రహదారి ప్రమాదకరంగా తయారయ్యిందని, తక్షణమే రహదారిలో పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పుడే నీటి ఎద్దడి ఏర్పడటం సిగ్గుచేటు

వేసవి కాలంలో సహజంగా ఏర్పడే తాగు నీటి ఎద్దడి ఈ నెలలోనే రావడం సిగ్గుచేటని మండిపడ్డారు. కృష్ణానదికి, మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌కు కూతవేటు దూరంలో ఉన్న టేనర్ పేట నుంచి భీమనవారిపేట వరకు నీటి కొరత ఏర్పడటం, ఆయా ప్రాంతాల ప్రజలు నీళ్ల కోసం పడుతున్న కష్టాలు సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి తాగు నీటి ఎద్దడి నివారణకు యుద్ధప్రాదిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జోనల్ కమిషనర్ రమ్య కీర్తనకు వినతి పత్రం అందచేశారు. ధర్నాలో సీపీఐ నాయకులు లంక దుర్గారావు, నక్క వీరభద్రాచారి, తాడి పైడయ్య, కొట్టు రమణారావు, డీవీ రమణబాబు, ఆర్ యాకోబు, కె శివయ్య, కె వెంకటేశ్వరరావు, ఎస్‌కె నజీర్, సీహెచ్ పార్వతి, దుర్గాసి రమణమ్మ, ఆర్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.